

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - పన్నెండవ కథ -

కొన్నాళ్ళు నేను విజయవాడలో పనిచేశాను. అప్పుడు నా ఫ్రెండ్, ఫిజిషియన్, డా. స్వప్న శ్రీ M.D చెప్పిన కథ ఇది

స్వప్న నాకు కొలీగ్ . ఆమె ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో సీనియర్ డాక్టర్ గా పనిచేస్తుంది. వయసులో చిన్నదికానీ, విసుగులేకుండా పేషంట్లతోనూ, వాళ్ళ బంధువులతోనూ మెలిగే తీరు చూస్తే ఎవరైనా ఆమె పట్ల అభిమానం పెంచుకుంటారు. పేషంట్ల కోసం డైరెక్టర్ దగ్గరకెళ్ళి తగువేసుకునేంత తెగువరి. మాటలలో ఎప్పుడూ చెప్పలేదు కానీ నేను కూడా ఆమె అభిమానినైపోయాను .

ప్రతి రోజూ లంచ్ ఇద్దరం కలిసే చేసేవాళ్లం. లంచ్ రూం లో మొదలైన స్నేహలతలు, సినిమాహాళ్ళవరకూ , కాఫీ షాపుల వరకూ పాకి పెరిగి దట్టమైన పొదల్లా తయారయాయి.

రుచులేకాదు, మా అభిరుచులు కూడా ఒకటే..ఎప్పటికైనా సరే ఒకతోట కొనాలనీ, అందులో చక్కటి ఇళ్ళు రెండు కట్టుకుని దగ్గర్లో ఉండాలనీ అనుకునేవాళ్ళం. అప్పుడప్పుడు తను ఏదైనా ఊరి చివర తోట లు అమ్మకానికొస్తే చూడడానికి వెళ్తూ వెళ్తూ నన్నూ పిలిచేది. నేనూ దారిలో బోలెడన్ని ఐడియాలు ఉచితంగా ఆమెకు ధారపోస్తుండేదాన్ని.

ఓ సెలవు రోజు వాళ్ళింటికి వెళ్లాను. తనకూ నాకూ సినిమాల విషయంలో ఒకే అభిరుచి. ఆ రోజు సాయంత్రం తనకిష్టమైన సినిమా వస్తోందని, అది ఇద్దరం కలిపే చూడాల్సిన సినిమా అని చెప్పి నన్ను ఆపేసింది.

ఒకే హాస్పిటల్ లో పనిచేసే ఇద్దరు డాక్టర్లు కలిస్తే ఏం మాట్లాడుకుంటారో అవే మాట్లాడుకుంటున్నాం. ఊహల్లోనే బాస్ ను చీల్చిచెండాడుతున్నాం. మేమైతే హాస్పిటల్ ను ఎంత చక్కగా, ఎంత పద్ధతిగా నడిపిస్తామో మాటల్లో కోటలు దాటేస్తున్నాం.

ఇంతలో బెల్ మోగితే స్వప్న వాళ్ల పనమ్మాయి తలుపు తీసింది. ఒకతను చేతిలో బరువైన గోనె సంచి తెచ్చి రూం లో ఓ మూల పెట్టాడు. చామన చాయ, పాతికేళ్ళు దాటిన వయసు. ఆరడుగుల పొడవున్నాడు.

అతన్ని చూస్తే ఇదివరకెప్పుడో చూసినట్లనిపించింది.

"ఏంటి కొండా, ఏంటవీ ?" స్వప్న అడిగింది.

కొద్దిగా వంగి నిలబడి " మనతోటలో కాసిన రసాలమ్మా. రెండురోజులు మగ్గబెడితే చాలు" అన్నాడు వినయంగా.

" అన్నేం చేసుకుంటాం కొండా?" అప్యాయంగా అంది.

కొండా…పేరు వినగానే అతనూ గుర్తొచ్చాడు. అతనితో బాటే అతని కథ కూడా!

ప్రతిరోజూ, లంచ్ కోసం వెళ్ళడానికి నేను స్వప్న పనిచేసే ఇంటెన్సివ్ కేర్ దగ్గరకు వెళ్ళేదాన్ని. ఆ యూనిట్ చాలా హడావుడిగా ఉండేది. ఎప్పుడు చూసినా స్వప్న పేషంట్లతోనూ, వాళ్ళబంధువులతోనూ మాట్లాడుతూనో, పేషంట్ పరిస్థితి గురించి వివరిస్తూనో కనిపించేది.

ఓ రోజున తను రూం లో ఖాళీగా కూర్చుని కనిపించింది.

"అమ్మయ్య, ఎన్నాళ్ళకు ఖాళీగా ఉన్నావు. రా వెళ్దాం" అన్నాను

" పేషంట్ వాళ్ళ భర్తకు కబురుపెట్టాను. అతనితో మాట్లాడగానే వెళ్దాం." అంది.

అతనొచ్చాడు. పాతికేళ్ళుంటాయేమో వచ్చి నించున్నాడు. కష్టం చేసే మనిషిలా ఉన్నాడు . రాటుదేలిన శరీరం. చేతికి కాశీదారం.

అతన్ని కూర్చోమని చెప్పింది. అలాగే నిలబడ్డాడు.

స్వప్న అతనికి అంతా వివరంగా చెప్తోంది. స్వప్న మాటల ద్వారా తెలిసిన దేమిటంటే, అతని భార్యకు ఆక్సిడెంట్ లో తలకు బాగా బలమైన గాయాలయ్యాయి. స్పృహలో లేదు. ఎప్పుడొస్తుందో తెలియదు. అసలు బతుకుతుందో లేదో కూడా తెలియదు.

కన్నొకటి పూర్తిగా దెబ్బతిన్నది.

" ఎలాగైనా మీరే కాపాడండి." అన్నాడు.

స్వప్న అతన్ని కూర్చోబెట్టి చెప్పింది. తమ చేతిలో లేని విషయాలు వివరించింది.

ఎంత ఖరీదు మందులైనా సరే వాడమన్నాడు.

వాడినా సరే ఒక్కోసారి పనిచెయ్యకపోతే చెయ్యగలిగేది ఏమీ ఉండదని చెప్పింది. అయినా సరే వైద్యం చెయ్యమన్నాడు.

లోపలికి వెళ్ళి చూశాను. ఆమె స్పృహలో లేదు. వెంటిలేటర్ మీద ఉంది. మోనిటర్ వంక చూసి కేస్ షీట్ చదివాను.

అతనేదో మధ్యతరగతి వ్యక్తిలా ఉన్నాడు. ఇలాంటి హాస్పిటల్ లో ఐ సి యు లో , అదీ వెంటిలేటర్ మీద ట్రీట్ మెంట్ అంటే ఎలా భరిస్తాడో అనిపించింది.

స్వప్న చెప్పేదాన్ని బట్టి చూస్తే ఏదో మిరకిల్ జరిగితే తప్ప ఆమె కోలుకుంటుందన్న నమ్మకం లేదు.

నేను పేషంట్ ని చూసి స్వప్న రూంలోకి అడుగుపెట్టేసరికి, అతను స్వప్న ముందు కూర్చుని వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

మేమిద్దరం ఒకరి మొహం ఒకరు చూసుకున్నాం.

ఏడిచే మగవాణ్ణి నమ్మలేమనే సామెతను నమ్మలేనంతగా ఉంది అతని దుఃఖం .

స్వప్న " మీరలా బాధపడితే ఎలా చెప్పండి. ధైర్యంగా ఉండాలి " అంది. అంతకన్నా స్వప్న దగ్గర ఓదార్చడానికి మాటల్లేవు.

కాసేపటికి ఇద్దరం లంచ్ కోసం కూర్చున్నాం కానీ ఒక్కటీ రుచిగా లేదు.

ఓ పావుగంటలో ఏదో తిన్నామనిపించి , లంచ్ అయిపోయాక ఎవరి దారిన వాళ్ళం వెళ్ళిపోయాము.

ఓ వారం రోజులు గడిచాయేమో. ఏ టైం లో వెళ్ళినా అతను కనిపిస్తూనే ఉండేవాడు. అంత ఓపికేమిటో అర్ధమయ్యేది కాదు.

అదికూడా ఒక్కసారికూడా బెంచీ మీద కూర్చునో , బల్లమీద పడుకునో కనిపించలేదు. ఎప్పుడూ నిలబడే ఉండేవాడు. ఏరోజూ స్వప్నను ప్రశ్నలతో సతాయించేవాడుకాదు. ఇబ్బంది పెట్టేవాడుకాదు. కాకపోతే పేషంట్ పరిస్థితి గురించి అతనితో ఏదైనా డిస్కస్ చెయ్యాలంటే మాత్రం చాలా విసిగిస్తున్నాడనేది స్వప్న. ఊరికూరికే కళ్ళనీళ్ళు పెట్టుకుంటాడట!

"ఓ రోజు నేను వెళ్ళేసరికి అతనితో చెప్తోంది. ఇవ్వాళ చాలా ఇంప్రూవ్ మెంట్ కనిపిస్తోందండీ. రేపు వెంటిలేటర్ నుండి తీసెయ్యాలని అనుకుంటున్నాం" అంది.

ఏమ్మాట్లాడ కుండా చేతులు జోడించాడు.

ఆరోజు లంచ్ టైం లో స్వప్న సాంబారులో అప్పడాలు లేవేంటని కిచెన్ వాళ్ళను అడిగి,వాళ్ళు వేయించి తీసుకొచ్చేవరకూ ఆగి మరీ భోజనం చేసింది.

తర్వాతిరోజు హాస్పిటల్ కు వెళ్తూ వెళ్తూ స్వప్న వాళ్ళింటి ముందు కారాపి హార్న్ కొట్టాను. వాళ్ళపనమ్మాయి బయటికొచ్చింది.

" అమ్మగారు రేత్రి రొండింటికి ఆస్పత్రికెళ్ళారండి. ఇంకా రాలేదు"

'ఎందుకువెళ్ళిందో' అని ఒక్క క్షణం అనిపించినా అలా వెళ్ళడం , హాస్పిటల్ లోనే ఉండిపోవడం మా ఇద్దరికీ అలవాటే కాబట్టి పెద్దగా ఆ విషయం గురించి ఆలోచించలేదు. వెళ్తూనే పనిలో పడిపోయాను. లంచ్ టైం కు గానీ స్వప్న గుర్తురాలేదు. ఐ సి యు వైపు వెళ్తే స్వప్న ఓ కుర్చీలో కూర్చుని ఉంది. ఎప్పుడూ లేనిది, అతను కనిపించలేదు.

స్వప్న వేసుకున్న డ్రెస్ అదీ నలిగిపోయి ఉంది. డ్రెస్సే కాదు, మనిషి కూడా బాగా నలిగిపోయి ఉంది. కేస్ షీట్ చూస్తూ, నర్సులతో ఏదో చెప్తోంది. మొహం బాగా గంభీరంగా ఉంది. తనని పలకరించడానికి నేను కూడా వెనకాడేంత సీరియస్ గా ఉంది.

లోపలికెళ్ళి నుంచున్నాను.

"ఏమైంది?"

"రాత్రి మళ్ళీ చాలా సీరియస్ అయింది. బాగా ఫిట్స్ వచ్చాయి." సిటి స్కాన్ రిపోర్ట్ చూపెట్టింది. ఇంకా ఏదో చెప్పబోతుండగా ,

ఆమె భర్త వచ్చాడు

అతనితో మాట్లాడింది.

ఏక్సిడెంట్ వల్ల బ్రెయిన్ లో రక్తస్రావం అయి, అది గడ్డ కట్టింది దాన్ని ఆపరేషన్ ద్వారా తొలిగించాలని చెప్పింది

"ఆపరేషన్ తర్వాత అంతా సరైపోతుందా మేడం?" అన్నాడు.

తర్వాత ఆమె పరిస్థితి ఏమిటనేది చెప్పలేమన్నది స్వప్న.

"ఏదైనా జరగొచ్చండీ. ఏ ట్రీట్ మెంట్ అయినా సరే పేషంట్ రికవర్ కావాలనే చేస్తాము. ఒకోసారి మనం అనుకున్నది కాకపోవచ్చు. ప్రాణాలకు ప్రమాదం ఏర్పడొచ్చు" అంది.

ఆ మాటకు అతని కళ్ళెర్రబడిపోయాయి. వెంటనే మా ఇద్దరిముందూ ఏడవడం ఇష్టం లేనట్టు బయటికెళ్ళిపోయాడు.

ఆమె గురించి చెప్పే సమయంలో, ప్రాణానికి రిస్క్ గురించి చెప్పాలంటే స్వప్నకు ప్రాణం మీదకొస్తోంది. అతను వినయంగానే ఉంటాడుకానీ ఆమెకేదైనా అవుతుంది అని చెప్తే మాత్రం తట్టుకోలేడు.

స్వప్నకు నీరసమొచ్చి, అది కోపంగా మారింది.

" అదికాదూ, ఆ అబ్బాయెందుకంత మొండిగా ఉంటాడూ. ఎందుకర్థం చేసుకోడూ...ఎంత పెద్ద ఏక్సిడెంట్ అయింది. రికవర్ అవుతుందన్న నమ్మకమే లేదు."

" అతనిమీద కోపమెందుకు, భార్య మీద ప్రేమ కొద్దీ అతను బాధపడతాడు. అది అతని హక్కు. మనమెవరం వద్దనడానికి? పిలిచి నువ్వు చెప్పాల్సింది చెప్పు."

కాసేపటికి స్వప్న మామూలుగా అయిన తర్వాత అతన్ని పిలిచి కూర్చోబెట్టి బతిమలాడుతున్నట్టు చెప్పింది. “ రేపు ఉదయం సర్జరీ చెయ్యడానికి ప్లాన్ చేశాం. మీరెలా తట్టుకుంటారోనని భయమేస్తోంది."

"ట్రీట్ మెంట్ కు ఏది అవసరమో అది చెయ్యండి మేడం"

"కానీ సర్జరీ చెయ్యబోయే ముందు మీరు కొన్ని విషయాలు తెలుసుకోవాలి. ఏ ఆపరేషన్ చేసినా దాని ఉద్దేశం పేషంట్ బయటపడాలనే. కానీ కొన్నిసార్లు అన్నీ మనం అనుకున్నట్లు జరగవు. మీ బాధ అదీ చూస్తుంటే , నాకు చాలా భయమేస్తోంది.ఏదైనా జరగరానిది జరిగితే..."

"అలా ఏం జరగదండీ. తను నన్ను వదిలివెళ్ళడానికి వీల్లేదు .ఇద్దరం కలిసే బతకాలనుకున్నాం. నేను బతికే ఉన్నప్పుడు తనుకూడా బతికే ఉంటుంది.” అతను నిలబడ్డాడు.

ఇద్దరం అతనివంక చూశాము.

ఎర్రబడి , ప్రేమతో నిండిపోయిన కళ్ళు , గొంతులో చిన్నపాటి వణుకు,

స్వప్న నిట్టూర్చింది.

"మీకెలా చెప్పాలో తెలియడం లేదండీ..మీరిట్లా ఎమోషనల్ అయితే ట్రీట్ మెంట్ చెయ్యడానికి నాకు భయమేస్తోంది."

"అదేం లేదు మేడం, మీరు చెయ్యాల్సిందంతా చెయ్యండి" అంటూ కళ్ళు తుడుచుకున్నాడు.

"ఇంకో ముఖ్యమైన విషయం. ఇక్కడ నేను పనిచేసే డాక్టర్నే కానీ, హాస్పిటల్ నా స్వంతం కాదు. ఆపరేషన్ తర్వాత కూడా ఐ సి యులోనే ఉంచాల్సివస్తుంది. అది ఎన్నాళ్ళని ఇప్పుడే చెప్పలేను. సర్జరీకు, మందులకు, ఐ సి యు లో ఉన్నందుకు చాలానే ఖర్చవుతుంది."

ఆలోచనలో పడ్డాడు.

"షుమారు ఎంతవుతుందమ్మా?"

స్వప్న ఎవరికో ఫోన్ చేసి కొన్ని వివరాలు కనుక్కుని అతనికా వివరాలు చెప్పింది.

అతనెళ్ళిపోయాడు.

ఆ రోజు సాయంత్రం, మా డైరెక్టర్ వాళ్ల అమ్మాయి పెళ్ళి రిసెప్షన్. హాస్పిటల్ కు దగ్గర్లో ఉన్న ఒక ఫాం హౌస్ లో ఫంక్షన్ ఏర్పాటు చేశారు. పలకరింపులు, భోజనాలు అయిపోయిన తర్వాత హాస్పిటల్ స్టాఫంతా కబుర్లలో మునిగి ఉండగా స్వప్న నా దగ్గరకొచ్చి

"ఒకసారి హాస్పిటల్ కు వెళ్దామా?" అంది.

"కేసేమైనా వచ్చిందా? ఇవ్వాళ నీ డ్యూటీ కాదుగా ?" అనాను.

"కాదనుకో, ఒకసారి వెళ్ళాలనిపిస్తోంది"

తన మొహం చూసి మరేం మాట్లాడకుండా లేచాను. అప్పటికి రాత్రి పదకొండు అవుతోంది. రోడ్డు మీద ఎవరూ లేరు. పైన చంద్రుడు కూడా మాతో పాటే నడుస్తున్నాడు. చల్లటిగాలి. ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడుకునే మేము రాత్రి నిశ్శబ్దాన్ని చెదరగొట్టడం ఇష్టం లేనట్టు మౌనంగా నడుస్తున్నాము.

ఆ పేషంట్ ఎలా ఉందోనన్న అలజడి స్వప్నలో తెలుస్తోంది.

స్వప్న మామూలు చీరకట్టుకుంది కానీ నా చీర హాస్పిటల్ వాతావరణానికి తగినట్టుగా లేదని, హాస్పిటల్ ఆవరణలో పెద్ద లైట్స్ వెలుగుతున్నాయి. ఓ లైట్ స్థంభం కింద సిమెంట్ బెంచీ మీద కూర్చున్నాను. స్వప్న లోపలికి వెళ్ళింది.

పగలంతా హడావుడికి అలిసిపోయి , హాస్పిటల్ నిద్రపోతునట్లుంది. ఒక ముసలావిడ వచ్చి నా పక్కనే కూర్చుంది.

"మా జుబేదా కెట్టా ఉందమ్మా?"

ఆ ముసలావిణ్ణి అప్పుడప్పుడూ ఐ సి యు లో చూస్తూనే ఉన్నా ఈ మధ్య .

జుబేదా అంటే స్వప్న పేషంట్. ఆవిడెవరా అని చూస్తుంటే, మళ్ళీ ఆవిడే అంది.

"జుబేదా నాకోడలే. భార్యకు సీరియస్ గా ఉందని, మా కొండ నిద్రపోడం లేదు , తిండి తినడం లేదమ్మా."

కొడుకుని ముద్దుగా 'కొండ' అని పిలుస్తుందేమోననుకుని

"మీ అబ్బాయి పేరేంటీ?" అడిగాను

"ఏడుకొండలు"

'ఏడుకొండలకు జుబేదా భార్యా?' లోపల్లోపల ఆశ్చర్యపడుతూ,

" పెళ్లయి ఎన్నేళ్ళవుతోంది?" అడిగాను.

"నాలుగేళ్లవుతాంది. ఆళ్ళది కూడా మా పేటే. నేనూ, ఆళ్లమ్మా బాగా స్నేహంగా ఉండేవాళ్లం. మా కొండా, జుబేదా ఇద్దరూ కలిసే పెరిగారు. కలిసే బళ్ళోకెళ్ళేవాళ్ళు. కొండయ్యకు మా అన్నకూతుర్నిచ్చి పెళ్ళిచేద్దామని అనుకున్నాం. పెళ్ళిమాటలు మాట్టాడుకుని కూడా ఎళ్ళాడు మాయన్న. ఇషయం తెలిసి జుబేదా మా ఇంటికొచ్చింది. నామీద ఎట్టా గొడవేసుకుందనుకున్నావూ. కొండని వేరే పిల్లకిచ్చి పెళ్ళిచేస్తావా అని నా ఇంట్లోనే కూలబడి ఏడ్చింది. మతం వేరే భాష వేరే అట్టెట్టా కుదురుద్దీ అని మేమెంత చెప్పినా వినలా. కొండా వచ్చి సముదాయించబోతే ఆణ్ణి కొట్టి మరీ ఏడ్చింది. ఆళ్ళమ్మా, అయ్యా వచ్చి ఎంత బతిమాలినా వినలేదు. ఇదే నా ఇల్లు, నేను రానుపొమ్మంది. ఇద్దరికీ పెళ్ళిచేశాం. పెళ్ళిచేసినందుకు నేనంటే ఎంత ఇష్టమనుకున్నారు. కాలు కిందపెట్టనివ్వదు. మావాళ్ళపిల్లని చేసుకున్నా ఇంత బాగా చూస్తదా అనుకుంటా. మొన్న ఆళ్ళ బాబాయి కొడుకు నిఖా ఐతే ఆళ్ళ చుట్టాలందరూ బస్సేసుకుని ఎళ్తన్నారు. కొండయ్యని పెళ్ళినాటికి రమ్మని చెప్పి ఆళ్ళతో ఎళ్ళింది. ఇదుగో ఇట్టా ఘోరం జరిగిపోయింది. ఆ యేళనుండి నా బిడ్డ , ఒక్కరోజైనా సరిగ్గా తిండి తిన్నదిలేదు, కన్నుమూసిందిలేదు. అల్లల్లాడిపోతన్నాడు" అంటూ చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంది.

తర్వాతిరోజు ఉదయం ఆపరేషన్ బాగానే జరిగింది. ఆపరేషన్ బాగానే జరిగిందని చెప్పిందతనికి. అతను వెళ్ళిపోయాడు. తర్వాత లంచ్ రూం బయట కలుసుకున్నాడు.

ఏంటని అడిగితే, "ఆపరేషన్ బాగానే తట్టుకుంది కదండీ. అంతే ఇంక పర్లేదా?" అడిగాడు

"ఒకటి రెండురోజులు చూస్తేనేగానీ ఏదీ చెప్పలేము. ప్రస్తుతానికి మాత్రం బాగానే ఉంది."

స్వప్న బదులు చెప్పింది.

కాసేపాగిన తర్వాత కార్ పార్క్ లో కారెక్కుతుంటే, స్వప్న వాళ్ళ అన్నయ్య వచ్చాడు. ఓ తోట అమ్మకానికుందనీ, చూసేందుకు రమ్మన్నాడు. మూడ్ లేదని స్వప్న గుణుస్తూ ఉంటే, ఒక్క అరగంట చాలని బతిమలాడి తీసుకెళ్లాడు.

అక్కడకెళ్ళి చూస్తే మేమిద్దరం ఆశ్చర్యపోయాము, జుబేదా భర్త కనిపించాడు. అమ్మకానికొచ్చిన తోట అతనిదేనట. భార్య వైద్యం కోసం అమ్మేస్తున్నాడట.

ఆ విషయం విన్న స్వప్న ఈ తోట నాకొద్దనేసింది.

అతనొచ్చాడు.

" మేడం , నేనెవరో తెలియకపోతే మీరు తీసుకునేవాళ్ళేకదా. అలాగే అనుకుని తీసుకోండి" అన్నాడు

"కానీ తెలుసుకదా " నావల్లకాదంది.

"మేడం , మీరు తీసుకోకపోతే , ఇంకెవరికైనా ఇవాల్సిందే....అదేదో మీరే తీసుకోండి."

"ఇది అమ్మకుండా కుదరదా?"

"కుదరదమ్మా, ఈ టైములో నాకు డబ్బు చాలా అవసరం ."

ఆ తర్వాత జుబేదా ఒక రోజు బాగుంటే , ఇంకోరోజు కంగారు పెట్టేది. అతను మాత్రం స్వప్న ఏం చెప్పినా చేసేవాడు. ఏ ఇంజెక్షన్ కావాలన్నా ఎదురు మాట్లాడకుండా తెచ్చేవాడు. ఎప్పుడో ఒకసారి స్పృహ వచ్చినట్టే ఉండేది, వెంటనే సీరియస్ అయిపోయేది. స్వప్న కూడా రాత్రీ పగలూ అనుకోకుండా జుబేదా పరిస్థితిని అంచనా వేస్తూ, ఆమెతో చాలా టైం గడిపేది. కొన్నాళ్ళు గడిచాక పరిస్థితి కంట్రోల్ లోకి వచ్చింది.

జుబేదాకు స్పృహ వచ్చి, ఆరోగ్యం నిలకడగా ఉన్న తర్వాత కూడా, అతనికి హామీ ఇవ్వడానికి స్వప్న చాలా వెనకాడేది. రేపెట్లా ఉంటుందో, అతనికి ఆశలు కల్పించడం ఎందుకని. ఆ నెలరోజుల్లో అతను చాలా బరువు తగ్గాడు. కాకపోతే స్వప్నను ఇబ్బంది పెట్టడడం మానుకున్నాడు. కానీ ఒక్కరోజుకూడా అతనిలో విసుగనేది కనిపించేదికాదు. ఏ టైం లో హాస్పిటల్ కు వెళ్ళినా అక్కడే ఉండేవాడు. కోలుకున్న తర్వాత ఆమెకు ఆహారం ఇవ్వడం, నడిపించడం ఫిజియోథెరపీ అన్నీ దగ్గరుండి చూసుకున్నాడు.

ఓనెల రోజుల తర్వాత డిశ్చార్జ్ అయి వెళ్ళిపోయారు. వెళ్ళిపోయే రోజున స్వప్న రూం లోకి భార్యను వీల్ చెయిర్ లో తీసుకొచ్చాడు. స్వప్నకు పట్టు చీర, పూలు , స్వీట్లు తెచ్చాడు. భార్యతో ఇప్పించాడు.

కృష్ణైనా ఎండుతోంది కానీ అతని కన్నీళ్ళు ఎండవే?

ఒక ప్రాణం కోసం ఇద్దరూ పోరాడారు. అతను భార్యను తీసుకుని వెళ్ళిపోయిన తర్వాత స్వప్న ను ఓదార్చడం ఎంతో కష్టమయ్యింది.

కథంతా మనసులో మెదిలింది.

ఎదురుగా చూస్తే ఏడుకొండలున్నాడు.

"ఒక్కడివే వచ్చావా?" స్వప్న అడుగుతోంది.

"లేదమ్మా ఇద్దరం వచ్చాం" అంటూ బయటికెళ్ళి "అమ్మగారు పిలుస్తున్నారు లోపలికి రా" అంటూ భార్యను లోపలికి తీసుకొచ్చాడు. ఆమె లోపలికి నడుస్తూ వస్తుంటే, కుడికాలు ఓ పక్కకు పడుతోంది. ఎడమ కన్ను లేదు. ఆ ప్రదేశంలో చిన్న గుంటలా ఉండి రెప్పలు మూసుకుపోయి ఉన్నాయి.

జుబేదా!

ఆ అమ్మాయి స్వప్నకు నమస్కారం పెట్టింది.

స్వప్న లేచి "కూర్చోండి..కూర్చోండి" అంటూ మాకెదురుగా ఉన్న సోఫాలో కూర్చోబెట్టింది. పనమ్మాయితో చెప్పి మాకూ, వాళ్ళకు తాగడానికి తెప్పించింది. అందరం ఆ చల్లని జ్యూస్ తాగుతున్నాం. స్వప్న చాలా సరదాగా మాట్లాడుతోంది వాళ్ళిద్దరితో. అతనిమీద జోక్స్ వేసి ఏడిపిస్తోంది. స్వప్న మాటలకు చాలా సిగ్గుపడుతున్నాడు. ఆ అమ్మాయికూడా ముసిముసిగా నవ్వుకుంటోంది.

ఆకుపచ్చ చూడీదార్ వేసుకుని, తలని చున్నీతో కవర్ చేసుకుని అచ్చమైన ముస్లిం వనిత లా జుబేదా!. కాశీదారాలు, నుదిటిన బొట్టు, మెడలో వెంకటేశ్వరస్వామి లాకెట్ తో ఏడుకొండలు, ఇద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు.

వాళ్ళని బయటకి పంపించడానికి ఇద్దరం ఇంటి బయటి వరకూ వెళ్ళాము. ఆమెకు ఒక కన్ను లేకపోవడంతో, పక్కకు తిరిగి చూసేందుకు తలమొత్తం తిప్పాల్సివస్తోంది. ఆమె చెప్పొకటి చెప్పుల స్టాండ్ కిందకు పోయినట్టుంది. అతను వంగి ఆ చెప్పుని తీసుకొచ్చి ఆమె కాలికి తొడిగాడు.

వెళ్ళేటపుడు మా ఇద్దరికీ నమస్కారం పెట్టి సెలవు తీసుకున్నారు.

"అవునూ తోట నువ్వు తీసుకున్నావుగా, మరి ఎక్కణ్ణుంచి తెచ్చావ్ డీ మామిడిపళ్ళు?" అడిగాను.

" తీసుకున్నాను కాని, కొనుక్కోలేదు. అదన్నమాట." నవ్వింది.

"ఏంటీ కన్ఫ్యూజన్?"

"కన్ఫ్యూజన్ లేదుకానీ టీవీ పెట్టు తొందరగా. జోధా అక్బర్ సినిమా వస్తూ ఉంటుంది" అని హడావుడి పడింది.

"జుబేదా– కొండల్ని చూపెట్టావుగా, నాకిదే బాగుంది."

*ప్రియమైన పాఠకులకు,*

*నమస్తే!*

*ఇంటికి ఎవరినైనా భోజనానికి పిలిచినపుడు అన్నీ రుచిగా కుదరాలనీ, వంట బాగుండాలని అనుకుంటాం కానీ ఏదో ఒకటి వండి పెట్టేద్దామనిపించదు. ఈ కథలు కూడా, నాకు బాగా సమయం దొరికితే, చాలా బాగా రాయాలని అనుకున్నాను. కానీ ప్రతినెలా యాంత్రికంగా నెలాఖరుకి ఒకటి రెండు రోజుల్లో రాసేశాను. మీపట్ల నాకు గౌరవం లేకమాత్రం కాదు. పని వత్తిడివల్ల. ఇలా హడావుడిగా వ్రాయడం, ఎడిటింగ్ కూడా చెయ్యకుండా పంపెయ్యడం, వల్ల నాలో తప్పు చేస్తున్న భావం పెరిగిపోతోంది.*

*మీ ఆదరణ నాకెంతో సంతోషాన్నిచ్చిందనడంలో సందేహం లేదు. స్నేహ పాత్రులైన కాంతిగారు, కిరణ్ ప్రభ గారు నేనేం వ్రాసినా చివరి నిముషం వరకూ కథ పంపకుండా విసిగించినా చాలా ఓపికగా కథలు ప్రచురించారు. వారిద్దరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.*

*కొన్ని కారణాలవల్ల రెండు మూడునెలలపాటు కథలు అందించలేనందుకు క్షమించాలని కోరుకుంటున్నాను..బహుశా మళ్ళీ ఏప్రిల్ నెలలో కథ వ్రాస్తాను.*

*అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.*

**మీ**

**శైలజ చందు**

Post your comments